కథానిక:

# "నవ్విన నాప చేను..."

## శ్రీమతి బారు సరోజనీదేవి

ఎగ్జిక్యూటివ్ కాలేజీనుంచి బస్సుకోసం జయపురంరాజుగారి బొమ్మదగరకూ నడచే లోగా, వుదయం పదిగంటల్నుంచీ సాయంకాలం అయిదయ్యేవరకూ జరిగినసంగతులన్నిటినీ హాస్యంగా నెమరువేసుకోడం, ఉష, శారదల కిద్దరికీ అలవాటు. ఇద్దరి మధ్యా స్నేహం అంతగా లేనప్పుడింత చనువుగా మాట్లాడుకోకపోయినా, నడుస్తున్నప్పుడు, ఎదురుగా వచ్చేవాళ్ళ చూపులనుంచి తప్పించుకోందామన్న బాధ రానురాను ఈ అలవాటుగా మారివుండచ్చు.

ఎప్పుడూ ఎవ్వరూ క్లాసులో వేళాకోళం చెయ్యని శారదని ఇవాళ ఎవడో ఏదో అన్నాడు. అది మనస్సులో వేధిస్తున్నందువల్ల కాబోలు శారద ఈరోజున ఉషతో చురుకుగా మాట్లాడ్డం లేదు. ఉషకి యీవిషయం తెలియక మామూలు ధోరణిలో యేవేవో చెప్తున్నది. వాళ్ల మేనత్తగారింట్లోకి క్రిందటిరోజునే మారినట్టు, ఇప్పుడు రోజూలాగ కాకుండా ఏ, వి, ఎన్, కాలేజీకోడ్డుదగ్గిరే కారు దిగవలసివున్నట్టు, మరేవేవో. శారద పరధ్యానంగా వున్నందువల్ల వినిపించుకోవడం లేదు.

"అలావున్నావేమే, శారదా?" అని ఉష గదమాయించేదాకా శారద సంభాషణలోకి, దిగలేదు. "మైత్రాస్కోపు, దగ్గిరకి వెడుతూవుంటే సీతాపతి 'ఓయబ్బో హంసల్లే నడుస్తోందిరోయ్' అన్నాడు. ప్రక్కనే నిలబడివున్న మేష్టరు వినీవిననట్టు ఊరుకున్నాడు."

"పో పో ఎవరేమన్నా ఉడుక్కుంటావు, హంసల్లే నడిచావు కామాల్ను, అన్నాడు. ఇంత పౌరుషం వున్నదానివి సమాధానం చెప్పలేకపోయావా మరి? అచ్చే ఎందుకు చెపుతావు. నీకూ కొంచెంగా సరదా ఉంది."

ఉషధోరణికి యేమాత్రం దోహదం యిచ్చినా తనని యేడిపిస్తుందని శారద గ్రహించుకుని మళ్లీ మౌనం వహించింది.

ఇద్దరూ జయపురంరాజాగారి శిలాప్రతిమ ఉన్న ఆవరణదగ్గర కు వచ్చి, బస్సు రావడానికి ఇంకా ఆలస్యం ఉన్నందువల్ల అక్కడ తూము గట్టుమీద చతికిలపడ్డారు. ఉషమళ్లీ తన ఇల్లుమారడం సంగతి చెప్తోంది.

"స్వంతయిల్లు వదిలేసుకుని, అట్లా మారేరేం?" అని శారద అడిగింది. "నేను చెప్పేదాన్ని కాదులే, మా నాన్నగారికి మా మామయ్యకి పడేదికాదనీ, మా మామయ్య పోయినతరువాత మా అత్తయ్య మగసాయం లేక మా నాన్నగార్నీ, నన్నూ, మా అమ్మనీ వాళ్ళయింటికే వచ్చి వుండమంటూన్నదనీ. కాని మా అమ్మకి సరిగ్గా ఇష్టం లేక ఈ రెండుసంవత్సరాల్నుంచీ వెళ్ళడంలేదు. మీ బావ పైలట్‌గా వున్నాడనీ యేదో చెప్పేదానివి కాదులే?

"మా బావ వస్తాడుట నాలుగైదు రోజుల్లో. మాఅత్తయ్య ఇంటికొచ్చెయ్యమని ఏడుస్తూ వుత్తరాలు వ్రాస్తూవుంటే, వుద్యోగం మానుకుని వచ్చేస్తున్నాడు!"

"బాగానే వుంది మీ నాన్నగారేమో, మీ అమ్మకి యిష్టం లేక మీ అత్తయ్యగారి యింట్లోకి మారలేదు. మీ బావేమో వాళ్ళ అమ్మకి ఇష్టం లేదని ఉద్యోగం మానేస్తున్నాడు."

"మా అత్తయ్యకేం బోలెడు ఆస్తి. కాబట్టి ఉద్యోగం చెయ్యకపోతే లెక్కాయేమిటి?"



"సరే నాకు తెలుసు, నువ్వు మీ అత్తయ్యని పొగడ్డంలేదు. మీ బావని పొగుడుతున్నావు" శారద చాల చిలిపిగా నవ్వుతోంది.

"చాల్లేవే నేర్చుకుపోయావ్!! అని ఉష అంటూవుండగానే బస్సువచ్చి ఆగడం,

యిద్దరూ కబుర్లు ఒక్కసారిగా ఆపుజేసి, దాంట్లో యెక్కిపోవడం జరిగిపోయింది.

ఉషా, వాళ్ళమ్మా, నాన్నా వాళ్ళ అత్తయ్యగారి ఇంటికొచ్చి రెండురోజులయింది. రెండేళ్ళనుండీ జనసంచారం తక్కువగా వుండడంవల్ల నిద్రపోతున్నట్టున్న ఇల్లు మళ్ళా కళకళలాడడం ప్రారంభించినా లక్ష్మమ్మగారికి అనుకున్నంత సంతోషంగా లేదు. ఇన్నాళ్లు పెళ్లాన్ని, పిల్లనీ తీసుకొచ్చేసి తనయింట్లోనే వుండమన యెంత బ్రతిమాలినా రాని తన తమ్ముడు, ఒక్కసారి హఠాత్తుగా వచ్చేస్తున్నానని చెప్పి, వచ్చి దిగిపోతే చాలా సంతోషంగా వుండవలసిందే ఆవిడకి. కాని, ఒకటి రెండురోజుల్లో కొడుకు వస్తాడన్న సంతోషం, మొన్న మొన్నటి వరకూ రానంటున్న తమ్ముడు హఠాత్తుగా వచ్చి దిగిపోవడంవల్ల వచ్చిన సంతోషం యీ రెండూ మనస్సులో సరిగ్గా ఇమడ్డంలేదు.

తమ్ముడు రామారావు సంసారంతో ఇంటికి వచ్చిన రెండు రోజులకి, లక్ష్మమ్మగారి కొడుకు సుందరం ఇంటికి వచ్చాడు. అతను తన మేనత్తతో అంత కలివిడిగా మసలకపోయినా, ఆవిడే తన శక్తి వున్నంత వరకూ లక్ష్మమ్మగారు కొడుకుమీద చూపించేంత అభిమానం తను కూడా చూపుతున్నది. ఎప్పుడూ లేనిది, మేనత్త ఇంతగా ఆపేక్ష ఎందుకు చూపిస్తూందో సుందరానికి అర్థం కావడంలేదు. వదినగారు చూపించే యీ ఆపేక్ష లక్ష్మమ్మగారికూడా సరిగ్గా అవగాహన కాకపోయినా, ఆవిడ అంతగా పట్టించుకోలేదు.

మేనత్త చూపిస్తున్న ఈ ఆపేక్షకి కారణాల్ని సుందరం వూహించుకుంటున్నాడు. కాని లక్ష్మమ్మగారంతగా ఈ గొడవ పట్టించుకోకపోవడానికి కారణాలున్నయ్. తన ఆస్తి తమ్ముడికి అక్కర్లేదు. అతనికే కావలసినంత ఆస్తి వుంది. కూతుర్ని తన కొడుక్కిచ్చి పెళ్లి చెయ్యడానికా అంటే, అలాంటి ఆలోచన కేం ఆధారం లేదు. తన కొడుకు పెద్దవాడైనా స్కూలు ఫైనలుదాకానే చదివాడు. మేనగోడలు ఉష బి. యస్. సి. నాలుగోయేడు చదువుతోంది. యెంత చుట్టరికం, ఆస్తికలవాళ్లైనా కూతురుకన్నా తక్కువ చదువుకొన్నవాళ్లకిచ్చి పెళ్లిచెయ్యడం ఏతల్లి, దండ్రులకి సాధారణంగా యిష్టం వుంటుంది? మరి ఆస్తే అక్కర్లేక, కొడుక్కి తన కూతుర్నిచ్చే వుద్దేశ్యమూ లేక, తన వదినగారెందు కింత మంచిగా మారిపోయినట్టు? ఈ ప్రశ్న లక్ష్మమ్మగార్ని అంతగా బాధించడంలేదు. కాని వదినగారయిన సీతమ్మగారు ప్రదర్శిస్తున్న అసహజమైన ఆపేక్షవల్ల ఇంట్లో మసులుతున్న మనుష్యులమధ్య వ్యవహారాలు కొత్తపంథా పట్టాయి.

సీతమ్మగారేమన్నా, ఏంచేసినా, వెనక యేదో బ్రహ్మాండమైన పితూరీ వుందని లక్ష్మమ్మగారనుకొంటూవుండడం, లక్ష్మమ్మగారేంచేసినా, అన్నా, తనని అనుమానిస్తున్నట్టు, సీతమ్మగారనుకుంటూవుండడం, యీ అనుకోవడాలవల్ల పైకి వ్యక్తమయ్యే భావాల్ని చూసుకొని, వారిద్దరిచుట్టూ తిరిగే గ్రహాలుకూడా అట్లానే ప్రవర్తించబోవడం, బాగా స్పష్టంగా వున్నది, ఇంట్లో వున్నవాళ్ల మొహాల్లో.

అయితే పరిస్థితులు ఇంత తేలికయిన కలతలతో కొట్టుకుపోవడం భగవంతుడి కిష్టంలేదు. లక్ష్మమ్మ, సీతమ్మగార్లకు ప్రతిరోజూ మధ్యాహ్నమప్పుడు, యీ కలతలు ఎట్లా బయలుదేరాయన్న సంగతి విడమర్చుకోడానికి తగిన సావకాశం కలుగుతూ వున్నా, ఆ సంభాషణకి కావలసిన మనస్థైర్యాన్ని ఇద్దరూకూడా కూడదీసుకోలేకపోతూవుండేవారు. అవసరంవున్న మనిషి గనక, సీతమ్మగారు యీమాటా ఆమాటా మధ్య సుందరానికి ఉష నిచ్చి పెళ్లిచేస్తే బాగుంటుందేమో అని చూచాయగా అనేదాకా సీతమ్మగారి మంచితనానికి గల కారణం వ్యక్తం కాలేదు లక్ష్మమ్మగారికి.

వదినగారికి తన కొడుకుమీద ఆశ వున్నట్టు స్థిరపడగానే, లక్ష్మమ్మగారు వెనకా ముందూ ఆలోచించసాగింది. 'తన కొడుకు తక్కువ చదువుకున్నాడు. పెళ్లి తర్వాత పరిస్థితులు సరిగ్గా వుండవేమోఅని ముఖ్యంగా వ్యాకులపడుతూ వున్నా, వదినగారు ప్రత్యేకంగా యెంతో గౌరవం అభినయించడం చాలా బాధగా వుంది ఆమెకి. ఈ బాధే వదినగారి కోర్కెకి సమాధానం చెప్పేయ్యమంటోంది; అదేం లాభం లేదమ్మా అని. కాని లక్ష్మమ్మగారు తొందరపడదల్చుకోలేదు. ఈ విషయంలో తన భూముల గొడవలూ అవీ చూస్తూ పెద్దగా మసుల్తున్న తమ్ముడూ, యేళ్లొచ్చి అనుభవం గడించుకొన్న కొడుకూ వుండగా ఆవిడేం బాధపడదల్చుకోలేదు.

కాని సీతమ్మవదిన తనమీద అనేక రూపాల్లో వాడుతున్న వొత్తిడిని తమ్ముడిమీదికీ, కొడుకుమీదికీ తోసేద్దామని నిర్ణయించుకుంది.

కొడుకుపెళ్ళిబాధ్యతని తన భుజాలమీదనుంచి మార్చుకోడానికి నిర్ణయించుకొన్న లక్ష్మమ్మగారు, కార్యాచరణకి సమయం చూసుకొంది. ఒకరోజు రాత్రి భోజనాల దగ్గర తమ్ముడు రామారావుని పలుకరించింది.

"ఒరే తమ్ముడూ, పెళ్ళాం లేకుండగా వాడూ, కోడలు లేకుండా నేనూ వుండడం అంత బాగుండలేదురా. నువ్వేదో యీ విషయంలో కలుగజేసుకుంటే వాడో యింటివాడూ అవుతాడు, నాకు కోడలూ వస్తుంది."

రామారావుగారు ఏమీ జవాబివ్వలేదు. సుందరం తలవంచుకొనే వున్నాడు. నెయ్యి వడ్డింపుకోసం ఆగదిలోనే వున్న ఉష కూడా తలవంచుకునే వున్నది. కాని ఎంతో నిశ్శబ్దంగా వున్న వాతావరణాన్ని సీతమ్మగారు చాలా అసందర్భంగా చీల్చేసినారు; "సుందరానికి యిప్పుడు పెళ్ళిచేసెయ్యాలని వుంటే ఆయన సంబంధం చూడ్డం ఎంతసేపూ, యిట్టే చూస్తారు" అని. తరవాత ఒదినగారితో "ఉష నీ కోడలు ముచ్చటగా చేసుకొంమూ" అని ఒక నవ్వు నవ్వింది. ఈ మాటల్ని సహజంగా అంటే చాలా సబబుగా వుండేదేమో కాని, ఆవిడ నవ్విన నవ్వు ఆమెమనస్సులో వున్న వుద్దేశ్యం యొక్క నిజస్వరూపాన్ని బయటపడేసింది

ఎదుటవారి మాటలు అర్థంచేసుకోవడం లక్ష్మమగారికి సహజంగా వచ్చిన విద్య. నిదానంగా మసలడం ఆవిడ ఒకర్ని చూసుకొని నేర్చుకోలేదు. యెంత నిదానంగల మనిషి కాకపోతే తన కొడుకుపెళ్ళిబాధ్యత యింకొకరి కొప్పజెప్పగలదు?

సీతమ్మగారన్న మాటలు లక్ష్మమ్మగారికి చాలా అసందర్భంగా కనబడ్డాయి. ఎంతో విశ్వాసంతో తమ్ముడికి తన భారాన్ని ఒప్పజెప్పబోతూవుంటే, తన ఒదినగారు యిలా తేలిపోవడం ఆవిడ కేమీ నచ్చలేదు. ఆలోచించి "సర్లే సీతమ్మా, నువ్వు జ్ఞాపకం చెయ్యాలా ఉషని? అది పుట్టినప్పటినుంచీ మేనగోడలుగానే చూచుకొంటున్నాను"అన్నది. తన

(33-వ పేజీ చూడుడు)

# “నవ్విన నాపచేను....”

(14 పేజీ తరువాయి)

ఉద్రేకాన్ని యెంతగా కుదించుకుందో ఆవిడకే తెలుసు.

లక్ష్మమ్మగారు ఆ మాటలు యే భావంతో అన్నదో రామారావుగారికి అవగాహ నయిపోయింది. అతనికి జవాబు చెప్పక తప్పలేదు.

“పోనిద్దూ అక్కయ్యా. ఎవరాళ వాళ్లది. అది అట్లాగ యేదో అంటూ వుంటుంది. యింత చిన్న విషయంగురించి మాటామాటా అనుకోవడ మెందుకు పోనిద్దూ. నీకు నీ కొడుక్కి పెళ్లి చేసెయ్యాలని వుందని తెలిసింది. ఇప్పుడు వాడికి చేసుకోవడం యిష్టం అవునో కాదో తేలేదాకా అసలు ఈ గొడవే యెత్తుకోవద్దు మనం” తమ్ముడు అన్న మాటలు లక్ష్మమ్మగారికి నచ్చేయి కామోల్ను, వెంటనే సమాధానం చెప్పేసింది. “చూడు తమ్ముడూ, ఉషా వాడూ ఎదిగినవాళ్లే కాని పిల్లలు కాదుకదా. ఒకర్నొకరు వరించుకోవడానికి ఎవరి కేకష్టాలున్నాయో తెలియదు. యిట్లాంటప్పుడు నా అభిప్రాయంకోసం సీతమ్మమాట ఒదిలిందికదా మరి. నే నేదో సమాధానం చెప్పేస్తే ఏమవుతుంది చెప్పు?”

“అవును మరి, నువ్వు చెప్పింది రైటే. కుర్రనాగమ్మ వాడి కేమిటో చెప్పు, మా అమ్మ అభిప్రాయం యిట్లా వుంది కామోల్ను, అట్లా చేసేస్తే పెద్దది సంతోషిస్తుం దని నీ మాట చెల్లించడానికి చూస్తాడే కాని, తన సంగతి చూసుకోడు – చూశా వక్కయ్యా. యీ పెళ్లిగొడవలు ప్రారంభంలో యేమీ లేనట్టుగా వుండి, రాను, రాను తగువుల్లోకి దిగుతాయి. అందుచేత సుందరంఅభిప్రాయం ప్రారంభంలో తేలితేగాని, యీ విషయమే యెత్తుకోవద్దు మనం, ఎంచేత నంటావా, వాడి జాతకంలో స్కూలు ఫైనలుదాకా చదివినా, యుద్ధంలోకి పోయి పెద్దపైలట్ అవ్వాలని వుంది దాని జాతకంలో బి. ఎస్. సి. దాకా అయినా చదువుకోవాలని వుంది. సాధారణంగా వాళ్లకన్నా యెక్కువగా చదువుకొన్న ఆడవాళ్లని చేసుకోవడం కుర్రాళ్లకి యిష్టం వుండదు.”

రామారావు ఈ మాటలు అన్నతర్వాత లక్ష్మమ్మగారే మనుకుందో గాని మరి మాట్లాడలేదు. సీతమ్మగారు మాత్రం చిన్నబుచ్చుకొంది, భర్త తన మాటల్ని తీసిపారేశాడని.

సుందరం వంటగదిలోంచి ఎంతో భారంగా తేలివచ్చాడు. పెళ్లిగొడవ అతని మీదికి రావడంవల్ల పాతసంగతులన్నీ జ్ఞాపకంరావడం మొదలెట్టాయి. నాలుగు సంవత్సరాల క్రిందట తను తల్లినీ తండ్రినీ దుఃఖపెట్టి మిలిటరీలో కెట్లా పారిపోయిందీ, మిలిటరీలోకి వెళ్ళకముందు ఎంతో సరదాగా తడుముకోకుండా మాట్లాడే ఉష, రెండుసంవత్సరాలక్రిందట తను సెలవుమీద ఇంటికి వచ్చినప్పుడు కాలేజీలో జేరిందన్న గర్వంవల్ల కాబోలు అసలు మాట్లాడక పోవడం, అన్నీ జ్ఞాపకం వచ్చాయి.

ఉషతత్వం చాల చిత్రమైంది. చదువుకోవడంవల్ల కొన్ని అసాధారణమైన లక్షణాలేవో తనని అంటుకొన్నాయని ఎవరైనా అంటే, చాలా కించపడుతూ ఉంటుంది. అట్లాంటివేవీ తనలో కనపడక శారదా, ఉషా యెప్పుడు మాట్లాడుకున్నా వైవిషయానికి సంబంధించినవాటిగురించే మాట్లాడుకొనేవారు.

“కాలేజీల్లో చదువుతే మన కేమిటో చెడ్డబుద్ధు లబ్బుతాయిట, యేమిటే అవి?” అని ఉష అంటే. “ఏమో మరి పాడైపోతాముట.” అని శారద నవ్వుతూ అనేది. దానికి ఉష జవాబు చక్కగా చెప్పేది. “పాడైపోవడం అంత సులభమటే?” అని.

ఆమటకు శారద, “క్లాసుల్లో చాలామంది మొగాళ్లతో కూర్చోడం, మాట్లాడ్డం ఉంటుందిగా, అందువల్ల మనం ఎవణ్ణో ఒక మొగాణ్ణి ప్రేమించడం, వాడు మనని ప్రేమించడం తటస్థిస్తుందట. అప్పు డింకేముంది?” అని జవాబు చెప్పి ఫకాల్న నవ్వితే ఉష వూరుకోదు.

“ప్రేమించేసి పట్టపగలే ఆ మొగాణ్ణి పట్టుకుపోయి సాయంకాలం ఆరయ్యేసరికి యింటి కెళ్ళాలిగా,” అనేది ఇంకా గట్టిగా నవ్వుతూ.

ఆడది యెక్కువ చదువుకుందనీ, మొగాడు తక్కువ చదువుకొన్నాడనీ, ఆ ప్రశ్నే రాకూడ దంటుంది ఉష. అయితే యీ తెలివితేటలన్నీ యీమధ్యనే వచ్చాయి ఉషకి. ఇంటర్మీడియట్ పూర్తయి, బి. ఎస్. సి. లో శారదస్నేహం కలిగేవరకూ, పెళ్లి అన్నది చేసుకోకూడదనీ, మొగజాతి పదార్థం అతి చండాలమైనదనీ, అందులో చదువుకోని మొగాళ్లు బ్రూట్సనీ అనుకొనేది. కుర్రతనంలోంచి పూర్తియవ్వనంలోకి మారే మధ్యరోజుల్లో, యిట్లాంటి అభిప్రాయాలు సాధారణంగా పుడుతూ వుంటాయి. ఈ ఆలోచనలే ఉషని సుందరంతో మాట్లాడనియ్యకపోయివుండవచ్చు. అయితే ఇప్పుడిన్ని తెలివితేటలు వచ్చిన తర్వాతకూడా సుందరంబావనుంచి తనెందుకు తప్పుకుతిరుగుతోందో ఉషకే అర్థం కావడం లేదు. తనకి బావని పలుకరిద్దామని బుద్ధిపుట్టినప్పుడల్లా, లోపల్నుంచి ఏదో మొండిచెయ్యి కారణం చెప్పకుండా వెనక్కిలాగేస్తుంది. పెళ్లిఆలోచన వచ్చినప్పుడల్లా ఉష అనుకొనేది “చదువుకుంటే మాత్రం తప్పా, బావా నేనూ ఎంతో సరదాగా ఉండేవాళ్లం” అని. ఆ ఆలోచన తలకాయలోంచి పోగానే మళ్లీ “మరయితే బావతో మాట్లాడనేం?” అని ప్రశ్నించుకుంటుంది. మాట్లాడ్డం మొదట్లో మానెయ్యడంవల్ల అదే అలవాటయి గొంతుక విప్పనివ్వడంలేదు. పోనీ మొగాడు బావైనా పలుకరిస్తాడేమో అంటే, అతనూ నోరు మెదపడు. పైపెచ్చు కలివిడిగా వున్నట్టే వుంటాడు......

ఉషపరీక్షల సంగతి పేపర్లో పడింది. కూతురి పరీక్షపోయిందని తెలియగానే, తన కుమార్తె ప్రజ్ఞకి లోపంవచ్చిం దని సీతమ్మగారు బాధపడి కూతుర్ని ఏమీ అనలేక ఊరుకుంది. పోతేపోయింది వెధవపరీక్ష. ఇంక ఆ పుస్తకాల జోలికి వెళ్ళకూడ దనుకుంది ఉష. ఎంచేతనంటే ఇప్పుడామె మనస్సంతా పెళ్లి, భర్త, ముందనుభవించవలసిన సుఖాలూ, వాటిమీదనే వుంది. తెల్లటి లుంగీ కట్టుకుని, చేతుల్లేని బనీను తొడుక్కొని అటూ ఇటూ చురుగ్గా తిరిగే బావని చూస్తే ఆమెలో కలిగే భావాలు ఆమెకు వింతగా ఉన్నాయి. ఎప్పుడూ కొంటి కుర్రాళ్లమధ్య కూడా చురుగ్గా మెలిగే ఉషకి, అదోరకం వికారం చలనం ఇప్పుడే ప్రారంభ మయింది. సౌష్ఠవమైన శరీరం కల బావను అస్తమానం చూస్తున్న ఉషకు మనస్సు చికాకుపడ్డానికి ప్రారంభించింది. అది ప్రారంభించాలే కాని ఆ తరవాత ఇంక అదీ చికాకు. ఈ చికాకు మనస్సులో ప్రవేశించినదగ్గర్నుంచీ ఏమైనాసరే బావతో మాట్లాడేద్దామనుకుంటోంది ఉష. కాని సాధ్యపడ్డం లేదు. అయితే బావతో మాట్లాడ్డానికి కావలసిన ధైర్యానికి తాను క్రమంగా దగ్గర పడుతున్నట్టు గ్రహించుకుంది.

పైలట్‌వుద్యోగానికి మెడ్రాస్‌లోని ఏర్‌వేస్ కంపెనీకి పెట్టిన దరఖాస్తుకి సమా

ధానం వచ్చింది. సుందరానికి, ఇంటర్వ్యూకి రమ్మని ఏర్‌వేస్‌వాళ్లు వ్రాశారని తల్లితో చెప్పగానే, ఆవిడ అంతగా సంతోషించకుండా "ఉద్యోగం మానేసివచ్చి నాదగ్గిరే వుంటా వనుకుంటే, మళ్లీ యిదేమిట్రా" అన్నది.

సమాధానానికి సుందరం అంతగా ఆలోచించలేదు. "మిలిటరీకన్నా యిది చాలా నయం అమ్మా, అక్కడ వున్నన్ని కట్టుబాట్లు యిక్కడ వుండవు. అదీగాక, యిట్లా యింట్లో కూర్చుంటే నాలుగురోజులికి నాకే అసహ్యమేస్తుంది. అయినా యింకా వుద్యోగం కాలేదుగా" అని అక్కడ ఆగి, "ఎప్పుడెళ్లమన్నావమ్మా" అన్నాడు.

లక్ష్మమ్మగారు "నీ యిష్టం బాబూ" అనగానే సుందరం "రాత్రి బండికే వెళ్తానమ్మా, పట్నంలో చూసుకోవలసిన పని కూడా వున్నది" అని జవాబిచ్చాడు. సరే వెళ్లమని చెప్పేసి లక్ష్మమ్మగారు ఇంట్లోకి వెళ్లిపోయింది. అప్పటి కప్పుడే సాయంకాలం అవుతుండడంవల్ల, హోల్డాలు సర్దుకోడానికి తన గదిలోకి వెళ్లాడు సుందరం.

"ఇవ్వాళ చతుర్దశి రేపు పోనిచ్చి యెల్లుండి వెళ్లకూడదురా" అంటూ క్యాలండరు పుచ్చుకొని వచ్చింది లక్ష్మమ్మగారు. అప్పటికప్పుడే సుందరం హోల్డాలు బిగించెయ్యడంవల్ల "కట్టేశానే!" అన్నాడు తల్లితో. కాని—

"కట్టేస్తే యేంలే, పడుకోడానికి పక్క లేదా యేమిటి?" అని తల్లి అన్నమీదట ఆవిడమాట తీసెయ్యలేక ప్రయాణాన్ని ఆపేశాడు.

రాత్రిభోజనా లయిపోయాయి. భోజనం అవగానే నడుం వాలుద్దామన్న వూహతో పైకి వచ్చి వరండాలో వున్న మంచాన్ని వాల్చుకుని ఒక తలగడా తలక్రింద పెట్టుకొని విశ్రమించాడు. సుందరం బయటకు వచ్చిన కాస్సేపటికి సీతమ్మగారూ, ఉష, వరండాకి ఎడంవైపుగా వున్న వాళ్ల గదిలోకి వెళ్లిపోయారు. ఉష, సీతమ్మగారూ పడుకొనే యీ గదిలోంచి వరండాలో పడుకొన్న సుందరం బాగా కనిపిస్తాడు. తన బావ కొద్దిదూరంలో ఎదురుగా పడుకున్నందువల్ల ఉష సిగ్గుపడి వెనకమంచం మీద పడుకుని, తల్లిని ముందుమంచంమీద పడుకోబెట్టింది. అంతేగాని అతనికి కనబడకుండా మంచాన్ని మాత్రం మార్చుకోలేదు.

పదిగంట లయివుంటుంది. అందరూ నిద్రపోయారు. అయితే ఆ యింట్లో వున్న ఇద్దరికిమాత్రం నిద్ర పట్టడంలేదు. ఒకరి బాధ ఒకరికి తెలియక, తనొక్కర్తే లేచి ఉందని ఉషా, తనొక్కడే లేచి వున్నాడని సుందరంమాత్రం అనుకుంటున్నారు. వారిద్దరికీ నిద్రపట్టకపోవడానికి కారణం ప్రకృతిదే అవడంవల్ల "ఆలోచన లుంటేమాత్రం, నిద్ర ఎందుకు పట్టకపోవాలీ అన్న ప్రశ్నకి సమాధానం దొరకడంలేదు వాళ్లిద్దరికీ.

వెన్నెట్లో తెల్లగా కనిపిస్తున్న సుందరం ముఖం ఉషని కలతపెడుతోంది. అర్ధరాత్రివేళ బావని వెళ్ళి లేపుతే యింకేమైనా వుందా, అని తర్వాత అనుకున్నా, సహజంగా వచ్చే ఒక ఆలోచనమాత్రం ఉషకి రాకమానలేదు — "చాలా బాగా కనిపిస్తున్నాడు. లేపి పలకరిస్తే యేం" అని. ఇట్లాంటి ఆలోచనలకి అర్థం చాల తక్కువని వెంటనే అనుకొని రెండోప్రక్కకి ఒత్తిగిలింది ఉష బలవంతంగా.

పైకి ఉబికి రాబోయే మనోభావాల్ని అణచిపెట్టుకొని అట్లా ఉష నిద్రపోవడానికి ప్రయత్నిస్తూ వుంటే, ఇటు సుందరం చాలా చిత్రమయిన ఆలోచనలకి లొంగిపోతున్నాడు. అమ్మను ఉషకి తనంటే యిష్టం వుందో లేదో అడగమందా మన్న ఆలోచనతో బయలుదేరి, యిష్టమే వుంటే ఉష ఇట్లా ప్రవర్తిస్తుందా అని తర్జనభర్జన చేసుకుంటున్నాడు. ఇద్దరికీ ఒకప్పుడు ఇష్టమున్నప్పటికీ, ఉష చదువుకున్నానన్న గర్వంతో ముందుముందు ఎట్లా ప్రవర్తిస్తుందో అనుకుంటూవుంటే ఏదో ఆలోచన చటుక్కున తట్టింది. దాంతో మనిషి ఒక్కసారి గంభీరుడైనాడు. తట్టిన ఆలోచనకి అర్థసందర్భం ఏమాత్రం లేదనుకుని కళ్లు గట్టిగా మూసుకున్నాడు. ఎంత గట్టిగా మూసుకున్నా ఆ ఆలోచన మనస్సుని వదలలేదు. ఏ నిమిషానికే మనిషిప్రవృత్తి ఎట్లా మారుతుందో ఎవరికీ అర్థం కాదు. మనస్సుయొక్క సారథ్యం ఒకొక్కప్పుడు అర్థంలేకుండానూ, అసందర్భంగానూ వుంటుంది. అందులో, మనస్సు ఈ ఆలోచనల్ని పుట్టించడంతో వదలకుండా ప్రోద్బలం కూడా ఇచ్చిందంటే, చాంచల్యానికి లొంగే బుద్ధివున్నవా డెవడూ తప్పించుకోలేడు.

ఆలోచనలవల్ల ఉద్భవించిన మైకం ఒక్కసారి అతన్ని కూర్చోపెట్టింది. అతను అట్లాగే ఒక్కనిమిషం వుండిపోయి "ఇప్పుడు పారిపోవడం దేనికి? పెళ్లిసమస్య ఏదైనా వురిశిక్ష కాదుగదా పారిపోడానికి? నాకింత పిరికితనం దేనికి? పారిపోతే అమ్మ ఎంత యేడుస్తుందో?" అనుకుని మళ్లీ పడుకున్నాడు. సుందరం లేవడం పడుకోవడం ఉష కనిపెట్టింది. కాని అతని మనస్సులోని జిజ్ఞాస ఆమె కేం తెలుస్తుంది? బావకూడా తనకుమల్లేనే మాట్లాడ్డానికి లేచి, సంకోచించి మళ్ళా పడుకొన్నాడు అనుకుందే గాని, పిచ్చిఆలోచనలమధ్య కొట్టుకుంటున్నాడని ఆమెకి తెలియదు.

పిచ్చిఆలోచన్ల మైకంలో రేగిపోతున్న సుందరం లేచి సాయంకాలం బిగించిన హోల్డాలు వున్న గదిలోకి వెళ్లేదాకా, అతని భావతరంగాల్లో వున్న అర్థరాహిత్యం పూర్తిగా అతనికి వ్యక్తం కాలేదు. తను మగవాడవడ మేమిటి, తన పెళ్లి ఏమిటి నేడో రేపో యింటర్వ్యూకి వెళ్దామనుకోవడ మేమిటి, ఇప్పుడు అర్థంకాకుండా తెలివితక్కువగా పిరికితనంతో పారిపోవడానికి లేవడ మేమిటి? అసలు తను పారిపోవడం ఎందుకు? ఎవరైనా ఏమైనా బలవంతం చేశారా, లేదే! అంతా తన భుజాన్నే వేశారా? ఇంకా నయం, ఎవరైనా చూశారు కాదు. అనుకుని నవ్వుకుని అలాగే హోల్డాలుదగ్గరే కూచుండిపోయాడు.

బావ లేవడం చూసిన ఉష మొదట తనతో మాట్లాడ్డానికే వస్తున్నా డనుకుంది. అతను లోనికి వెళ్లడం చూసి దెబ్బ తిన్నది. లేచి కూర్చుంది.

"బావ ఇంకేదో పనిమీద లేచి వుంటాడు. నేను పొరపాటుపడ్డాను. అనుకొంటే అనుకొన్నానుగాని, ఇప్పుడు లోపలే వుంటాడుకనక వెళ్లి మాట్లాడతా" అనుకుని ముందూ వెనకా ఆలోచించుకోకుండా, నెమ్మదిగా గదిలోకి వెళ్లి హోల్డాల ముందు నిలబడి, తపస్సుచేస్తున్నవాళ్ళా వున్న సుందరాన్ని చూచింది. అయితే అతనట్లా యెందుకు నిలబడివున్నాడో స్ఫురించలేదామెకు. నెమ్మదిగా "బావా" అన్నది. ఈ నిమిషానికి ఉష తన వునికినీ, తన శరీరాన్ని మర్చిపోయిందనకోవచ్చు.

సుందరం వెనక్కి తిరిగి చూడకపోయినా, ఈ ప్రపంచంలోమాత్రం పడ్డాడు. పరిస్థితిల్లా వచ్చిన ఈ హఠాత్పరిణామాన్ని గురించి ఆలోచించుకోడానికి ఇంక వ్యవధి

లేకపోయినా, గుండెమాత్రం గబగబా కొట్టుకోడం ప్రారంభించింది.

"ఊఁ" అన్నాడు. 'ఊఁ' అని చాలా మామూలుగా అనివుండవచ్చు. కాని ఉషకి మాత్రం ఆ సమాధానం చాలా అర్థవంతంగా కన్పించింది. ఆమెమనస్సులో మాట రూపం పొందలేక గిజగిజలాడుతోంది. అయితే ఆమె ఇచ్చిన జవాబులో భారం, మమకారం యెక్కువగా వుంది. తన్మయత్వంలో "నన్ను చూస్తే మాట్లాడాలని వుండదు. కోపమా ఏం?" అన్నది.

"నాకు ఎవరన్నా కోపం లేదు. నువ్వంటే అసలే లేదు"

"కోపం లేకపోవచ్చు, యిష్టమో ?"

"నాయిష్టానికేంలే, సంస్కారం లేని వాణ్ణి. ఇష్టం లేకపోవడమే మంచిది. ధ్యేయించే తంటే ప్రయోజనం లేదుగనుక."

"నాకు తెలుసులే నీబాధ. ఇంతోటి నాచదువు నీ ఒళ్లో పెట్టుకొని రోజూ నీకు చూపిస్తూ కూర్చుంటా కాదూ? వంటా అదీ మానేసి, పేపరో, పుస్తకమో పుచ్చుకుని కుర్చీలో కూర్చుని, నీ అవస్థలు నిన్ను పడమంటా. అట్లా నాలుగురోజులు చలాయించి ఈ మొగుడేమిటి నాకు, ఏ కలక్టర్నో పెళ్లాడక. అని నిన్ను వొదిలేసి చక్కాపోతాను. సంస్కారం వున్నదాన్నిగా మరి?" ఉష పరిహాసమంతా నాలికచివర్న పోగయిందా అనిపించేటట్లు.

"అన్నీ నువ్వే అనుకొంటున్నావు" అన్నాడు సుందరం.

"అవునవును. నేనే అనుకొంటున్నాను. నువ్వు చాలా తెలివితక్కువవాడివిగా! నిన్ను లొంగదీసుకోవడం యెంతలే. పెత్తనం చెలాయించడానికిని."

ఈ మాటలు విన్నతరువాత, ఉబ్బిపోయో ఉష అన్నమాటలు నచ్చో తెలియదు, సుందరం ఉషవైపు మొహం త్రిప్పి - "ఇప్పుడేం చెయ్యను ?" అన్నాడు.

"ఏమో నీ ఇష్టం" అన్నదామె.

"నా ఇష్టమేగా" అంటూ చిన్ననవ్వుతో ఒక్క అడుగు ముందుకు వేసి, వెనక్కిపోబోతున్న ఉషచేతుల్ని సున్నితంగా పట్టుకొని, ఒక చేత్తో ఆమెగడ్డాన్ని నిమిరాడు. నాజూకుగా. సుందరం చేసిన ఈ చిన్నచేష్ట ఉషను చాలా ప్రమాదస్థితిలోకి దించింది. నరాలన్నీ ఒక్కసారిగా బిగుసుకొని పోయాయి. గుండె దడ దడ కొట్టుకుంటోంది.

మంచంమీదనుంచి కూతురు వెళ్లండ గ్రహించిన సీతమ్మగారు, యేవో మాటలు వినపడగానే ఖంగారుపడి లోపలికి వెళ్లింది. కూతుర్నీ, హాల్డాల్నీ, సుందరాన్నీ చూసి, ఏం ఆలోచన తట్టిందోగాని, చప్పుడు కాకుండా లక్ష్మమ్మగార్ని లేపడానికి మేడమీదికి వెళ్లింది.

ఎవరైనా వస్తారేమో అన్న జ్ఞానమైనా లేకుండా లోపల గదిలో నిలబడివున్న వ్యక్తుల్ని లక్ష్మమ్మ, సీతమ్మగార్లిద్దరూ వచ్చి ఖంగారు పెట్టారు. సుందరం, ఏమైతే అయింది, ఖంగారుపడి లాభం లేదని ముఖం గంభీరంగా పెట్టి కూర్చున్నాడు. బావగారు మాట్లాడే స్థితిలో లేరని తెలుసుకుని ఉష ఒక సంజాయిషీ కల్పించింది. ప్రక్కనవున్న హాల్డాల్ని సాక్ష్యం చేసుకొని నెమ్మదిగా అన్నది "బావ ఎక్కడికో హాల్డాలు తీసుకొని వెడుతూవుంటే నేను లేచి అడ్డుకున్నాను" అని.

# ప్రభుత్వము - విమర్శకులు

(19-పేజీ తరువాయి)

పక్కన అంటూ, జమీందార్లకు ఇంకా ఎక్కువ పరిహారం ఇవ్వాలి, ప్రభుత్వం పౌరుల ఆస్తులను స్వాహా చేస్తోందీ అని అంటారు.

జమీందారులు తిన తిండి, కట్టుబట్ట లేని స్థితిలో ఉన్నారనిగాని, ఉండాలనిగాని ఎవ్వరూ అనరు. ఇతరపౌరుల్లా చెమటోడిస్తే, జీవించగలరు. నిజానికి వారికి కోట్ల కొద్దీ పరిహారం ఇవ్వటం అనవసరం. కాంగ్రెస్ ప్రభుత్వాలు కాబట్టి ఈ కనకాభిషేకం జరుగుతోంది. అప్పటికీ ఇంకా తృప్తిలేదు. ఈ నష్టపరిహారం పౌరులందరూ భరించకూడదని, ఆ పొలాల రైతులే భరించాలని ఒక వాదన. ఏళ్ళతరబడి వాళ్ళు జమీందారీశిస్తుభారంతో కుంగి కృశిస్తున్నారని అంటూ, మళ్లీ వాళ్ళ నెత్తినే ఈ పదికోట్ల భారం పెట్టితే? ఈ రైతాంగాన్ని పీల్చి, పిప్పిచేసి, జమీందార్లు ప్రభుత్వాని కిచ్చే డబ్బులో పౌరులంతా ఇదివరకల్లా ప్రభుత్వం ద్వారా వసతులను పొందారు. ఇప్పుడీ భారం వహించటం బేసబబుకాదు.

తాగుబోతులద్వారా ప్రభుత్వాదాయంలో మూడోవంతు వచ్చేది. ఆ డబ్బుతో పౌరులందరకూ ప్రభుత్వం వసతులు కల్పించింది. ఇప్పుడు మద్యపాననిషేధాన్ని అమలుజరపటానికయ్యే ఖర్చు పౌరులంతా ఎందుకు భరించాలీ అంటే ?

కాబట్టి విమర్శకు లక్ష్యం ఉండాలి? ప్రజల్లో ఏకరగతివారి అభ్యుదయం లక్ష్యం? దరిద్రులు, బీదరైతులు, కార్మికులు, తక్కువజీతాల ఉద్యోగస్థులు, వీరి అభివృద్ధా లక్ష్యం? లేక అల్పసంఖ్యాకులైన లక్షాధికార్లు కోటీశ్వరులవటమా లక్ష్యం? అన్నితరగతులవారి అభివృద్ధీ లక్ష్యం అని కొందరంటారు. ఇది తప్పువాదన. లక్షాధికారిని కోటీశ్వరుడిని చేయటం, దరిద్రుడి నుద్ధరించటం ఈ రెంటిలో ఏదో ఒకటే సాధ్యమౌతుంది. కాని రెండూ నెరవేరవు.

ప్రభుత్వవిధానాలను విమర్శిస్తే చాలదు. ఆ విధానాల బదులు అంతకంటె మంచి విధానాలను సూచించగలగాలి. అప్పుడే విమర్శవల్ల ఉపయోగం. అప్పుడే విమర్శనాస్వాతంత్ర్యంవలన ప్రజల శ్రేయస్సు అభివృద్ధి చెంది, ప్రజాస్వామ్యం సుస్థిరం కాగలదు.

భారం ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం నిర్వహించేవారికే కాదు. విమర్శకులకూ బాధ్యత ఉంది. ప్రభుత్వాధికారం తమకు లభించినా, లభించకపోయినా, అంత బాధ్యతా వహించినట్టే మెలగాలి-విమర్శకులు. తమ ప్రణాళికలు, కార్యక్రమాలు ప్రభుత్వవిధానాలకంటే ఇంకెక్కువగా ప్రజల శ్రేయస్సు కుపకరించేట్లు ఉండాలి. అలా అని రుజువుచేయాలి.

శాసనసభలో ఉపన్యాసాలు జోరుగా ఇవ్వటం కాదు విమర్శకుల కర్తవ్యం. తమ తమ నియోజకవర్గాల్లో తమకు తోచిన నిర్మాణకార్యక్రమాలను ఏర్పరచి, కొనసాగించగలిగినప్పుడే, తమ ధర్మాన్ని నిర్వర్తించగలిగినవారవుతారు.

ప్రభుత్వాన్ని ప్రజలెలా ఒక కంట కనిపెట్టుతూవుంటారో, అలానే విమర్శకుల మాటలనే; కాదు; చేతలనకూడా రెండో కంట కనిపెట్టుతూఉంటారు. ఉండాలి.